# సినిమాలు : కథావస్తువు

“సుబుద్ధి”

ఏ చిత్రమైనా బాగున్నది, బాగులేదు అనే విషయం ఎక్కువగా ఆ చిత్రంయొక్క కథావస్తువుమీద ఆధారపడుతుంది. కథ, చిత్రం అంశాల్లోకల్లా ముఖ్యమైనది. కథలేని చిత్రం తలలేని శరీరంలాగ వుంటుంది. కాని మన నిర్మాతల్లో చాలామంది కథగురించి ఎక్కువ శ్రద్ధ తీసుకున్నట్టుగా కనబడదు. నటీ నటుల విలువమీద, పాటలు, నృత్యాల మద్దత్తులో ఏదో ఒక చిత్రంతీసి యివతల పారేస్తున్నారు. అలాంటి చిత్రాలు చప్పగా వూరుకుంటున్నాయి.

పురాణాలన్నీ మన నిర్మాతలు సెల్యులాయిడ్ మీద కెక్కించారు. దేవుళ్ళూ, దేవతలకీగాని, వ్యాసుడూ, వాల్మీకులకుగాని కోపం వస్తుందనైనా అనుకోకుండా, అవసరంకొద్దీ పురాణాలు మార్చారు. కొంతమంది నిర్మాతలు కష్టపడి మంచి కథలు వ్రాయించి, చక్కని సాంఘికాలు తయారుచేశారు. మన తెలుగు చిత్రాల్లో కొన్నైనా చెప్పుకోదగ్గవి వుండడానికి కారణం మంచి కథలు ఎంచుకోబడటమే.

జానపద చిత్రాలు తీయడం మొదలుపెట్టిన దగ్గర్నుంచీ చిత్రాల్లో కథలు నీరసంగా తయారయినాయి. కాశీమజిలీలు, అరేబియన్ నైట్సుల్లో కథలు చదువుకుని వూహించుకుందుకే బాగుంటాయిగాని, చిత్రాలుగా తీయటానికి బాగుండవని నా అభిప్రాయం. అయితే కేవలం వినోదంకోసమే తీసిన చిత్రాలు, వాస్తవికతకి దూరంగా వుండడంకోసమే నిర్దేశింపబడితే అందులో తప్పేమీ లేదు.

ఇంగ్లీషువాళ్లు గూడా ఒక అరడజనుకు లోపుగా, అరేబియన్ నైట్స్ కథలు చిత్రాలుగా తీశారు. అయితే వాటినిమరీ అంతపొడుగ్గా అనంతంగా పెంచకుండా, ప్రేక్షకుడికి అసందర్భాలతో విసుగెత్తించకుండా, జాగ్రత్తగా తీశారు. అంతేగాని ఆ చిత్రంద్వారానే ప్రేక్షకులకి కొంచెం నీతి, కొంచెం పాతివ్రత్యం, సత్యవాక్పరిపాలన, భక్తి, ముక్తి యిలాంటివన్నీ గరపాలనే ఆశకుపోలేదు. ఇంగ్లీషువారి జానపదచిత్రాలు (మన కొలతబద్దలతో కొలిచి ఆ పేరు పెట్టబడినవి) కేవలం వినోదంకోసం, ధైర్యసాహసాన్ని నిరూపించటానికి మాత్రమే తీయబడ్డాయి. ఆ వుద్దేశంతో తీసిన చిత్రాలు అమార్గంగా గూడా అమోఘంగా రాణించాయి.

మన జానపదచిత్రాలు కనీసం వినోదాన్నైనా యివ్వలేదని మనం ఘంటాపథంగా చెప్పవచ్చును. ఇక అసందర్భాలకి లోటే లేదు. కథ యీ విధంగా వుంటుంది—ఒక రాకుమారుడు, మంత్రి కుమారుడు యింట్లో దెబ్బలాడో, లేక మంచిమీదనో యిల్లు వదలి వెళ్ళిపోతారు. రాకుమారుడు ఒక నదిలో స్నానంచేస్తూంటే ఒక తలవెంట్రుక కనిపిస్తుంది. ఆ తలవెంట్రుకని పట్టుకుని 'యీ వెంట్రుకే యింత అందంగా వుంటే యీ వెంట్రుక హక్కుదారిణి యింకెంత అందంగా వుంటుందో' అని తలపోసి, ఆ నిష్పత్తిలో మోహించి, గట్టుమీదకి వచ్చి ఆ వెంట్రుక హక్కుదారిణి బొమ్మ ఏచెట్టుమీదో, దేవాలయం రాతిమీదో చెక్కేస్తాడు. ఆనాటి నుంచీ రాకుమారుడి విరహం ప్రారంభమవుతుంది. ఈబాధ మంత్రిగారబ్బాయి చూడలేకపోతాడు. ఇద్దరూ ఆ వెంట్రుక పట్టుకుని పేదరాశిపెద్దమ్మ దగ్గిరికి పోతారు. ఆవిడ సంగతంతా టూకీగా చెప్పేస్తుంది. ఏదో బ్రహ్మరాక్షసి ఆ రాజుగారమ్మాయిని ఎత్తుకుపోయి మఱ్ఱిచెట్టుమీద సాకుతోందని చెపుతుంది. ఆ అమ్మాయిని విడిపించినవారికి రాజుగారు ఆ అమ్మాయినిచ్చి వైభవంగా పెళ్ళి చెయ్యడమే గాకుండా ఆ రాజ్యాన్నిగూడా యిచ్చేస్తారని చెబుతుంది. మంత్రికుమారుడు, రాజకుమారుడూ ఆ మఱ్ఱిచెట్టు ఎక్కి తలో కొమ్మా పట్టుకుని పాకిపోతారు. ఆ కొమ్మలమీద కొన్ని రాజ్యాలు, పట్టణాలు వుంటాయి. ఎన్నో సంఘటనలయిన తర్వాత ఎలాగైతేనేం మంత్రికుమారుడు

మాయోపాయంచేత బ్రహ్మరాక్షసిని చంపి రాకుమారుని వెంట బెట్టుకొస్తాడు. కాని యింకా రాజకుమారుడు రాడు. ఈలోగా ఆపిల్ల తండ్రి వచ్చి తొందరచేసి మంత్రికుమారుడికి పెళ్ళి చెయ్యబోతాడు. మంత్రికుమారుడు యుక్తిగా తన కత్తికి బాసిక కట్టిస్తాడు. ఆ తర్వాత కార్యం చెయ్యబోతే ఆ గదిలో కూర్చుని ఆ అమ్మాయికి రోజుకొక పతివ్రత కథ వినిపిస్తాడు రోజూ ఆ అమ్మాయి తొందరపడుతూనే వుంది. నిరాశపడుతూనే వుంటుంది. చెలికత్తెలు రోజూ ఆ గదిలోకి ప్రొద్దుటే వచ్చి ఆశ్చర్యపడుతూ వుంటారు. ఇలాగ సరిగ్గా పన్నెండు రోజులు గడవగానే రాజకుమారుడు తిరిగి వస్తాడు. మంత్రికుమారుడు తప్పుకుని రాజకుమారుణ్ణి తన స్థానంలో ప్రవేశపెడుతాడు. రోజూ నిరాశతో కృంగిపోతున్న పెంట్రుక లమ్మాయి ఎవరో ఒక నాథుడని అంగీకరిస్తుంది. ఇదీ జానపద చిత్రం స్థూల కథ.

హిందీ చిత్రనిర్మాతలు 1945 సంవత్సరం వరకూ తీసిన చిత్రాల్లో స్టంటు చిత్రాలు మినహాయించగా, ప్రతి చిత్రానికి కథావస్తువు ఎంచుకోవడంలో చాలా జాగ్రత్త చూపారు. ఈ విషయంలో న్యూథియేటర్సు, ప్రభాత్, బొంబాయి టాకీసువారు ముఖ్యులు. రంజిత్ మూవిటోనువారు గూడా చాలా మట్టుకు కథా ప్రాధాన్యం వున్న చిత్రాలే తీశారు. ఇటీవల చిత్రాల్లో తారలకు యిస్తున్న విలువ కథకు యివ్వటంలేదు. సురయ, నర్గీస్, కామినీకౌశల్, దిలీప్ కుమార్, శ్యామ్ రెహమాన్ యిత్యాదులెవరో వుండేచాలు చిత్రంలో. అబ్బాయి, అమ్మాయి కథ ఏదోఒకటి తీసుకుని చిత్రం తయారుచేసి అమితమైన ధనార్జన చెయ్యవచ్చునని అనుకుంటున్నారు; అలాగే చేస్తున్నారు. ఇది కేవలం అభ్యుదయ నిరోధక మార్గం.

సినిమాల్లో కథలు ప్రేక్షకుల మనస్సు మీద, నడవడిక మీద బలంగా పనిచేసే టట్టుగా వుండాలి. సాంఘికంగా, దైనిక జీవితంలో ఎన్నో సమస్యల్ని తీసుకుని వాటికి మార్గాంతరం చూపించాలి. ప్రజలలో లోటుపాట్లు ఎత్తిచూపి వాటికి సవ్యమైనమార్గం చూపించాలి. ఈపద్ధతి పూర్వం వచ్చిన దునియా న మానే, పడోసి, జిందగీ వంటి చిత్రాలు తలమానికలు.

ప్రజలలో పెద్ద సంచలనం, పరివర్తనం చిత్రాల ద్వారా తీసుకు రాలేక పోతే, కనీసం మన కథకులు, నవలా రచయితల చేత కొత్త కథలు వ్రాయించడం, పాతవి చిత్రాలు తీయటం చేసినా యీనాటి అధోగతిలో వున్న సినీమాలు కొంత బాగుపడతాయి. న్యూథియేటర్సు వారు ఏనాడో శరత్ చంద్రుని 'దేవదాసు' చిత్రంగా తీశారు. మళ్ళీ యీ మధ్య 'రామేర్ సుమతి' నవలను 'ఛోటాభాయి'గా తీశారు. బొంబే టాకీసువారు రవీంద్రుని 'రెక్'నవలను 'మిలాన్' అనే పేరుతో చిత్రంగా తీశారు.

మన దేశంలో అన్ని భాషలలోనూ మంచి కథకులు, నవలా రచయితలూ వున్నారు. వారు యిదివరకే వ్రాసినవి, సినిమాకు పనికొచ్చేవి అనేక నవలలు, కథలు వున్నాయి. మన చిత్రనిర్మాతలు తామే కథలు వ్రాయటంగాని, లేక ఏ బావమరది చేతో, మేనల్లుడి చేతో వ్రాయించటంగాని మాని, గురజాడవారివి, చిలకమర్తి వారివి, నేటి కథకులవి అమూల్య రచనలు తెరకెక్కించటం ఎంతో సమంజసం. చిత్రానికి ఏర్పాటు చేసిన కవిగారెలాగూ వున్నారు గదా, వేరే డబ్బు యిచ్చుకోవడమెందుకు వారిచేతనే కథ వ్రాయించుదామనే కక్కుర్తి. నిర్మాతలు పడరాదు. ఈ విషయంలో మన నిర్మాతలు ముందంజ వేసి దేశంలో నేటి కథా- నవలా సాహిత్యాలకు తగిన ప్రోత్సాహమిచ్చి, తాము గూడా అభ్యుదయాన్ని కనబరిచే రోజులు ఎప్పుడొస్తాయి?

---

ఇండియా రైళ్లలో ప్రయాణం చెయ్యడంలోని సుఖాన్ని ఒకఅమెరికా పత్రికా రచయిత్రి యిలా వర్ణించింది : "ఫస్టు, సెకండు క్లాసుల్లోని ప్రయాణికులు రైల్వే సిబ్బందీని హింసిస్తారు. థర్డ్ క్లాసు ప్రయాణికుల్ని రైల్వే సిబ్బందీ హింసిస్తుంది. ఇంటరు క్లాసువాళ్లు ఒకళ్లనొకరు హింసించుకుంటారు."